క్లుప్తంగా

యాదవుల సంస్కృతిని పరిరక్షించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న పెద్దగట్టు ఆలయ చైర్మన్ కోడి సైదులు, రచయితలు

చివ్వెంల(సూర్యాపేట) : యాదవుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులుయాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి ఆలయ ప్రాంగణంలో కరీంనగర్ జిల్లాకు చెందిన డాక్టర్ పోతినేని తిరుపతి రచించిన పెద్దగట్టు చరిత్ర పుస్తక పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాదవుల సంప్రదాయాల అధ్యయన కోసం కృషి చేస్తున్న వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కవ్వం సాహితి వేదిక రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర నాయకుడు కుకట్ల తిరుపతి, శీల అవిలేష్, మందుల విప్లవకుమార్, జంగా వీరయ్య, భూతం సత్యనారాయణ, సైదులు, శ్రీనివాస్, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న వైస్ ఎంపీపీ మారిపెద్ది భవాని

అర్వపల్లి : పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉండేందుకే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని వైస్ ఎంపీపీ మారిపెద్ది భవానీశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాపురంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు ఆడపిల్లలు భారం కాకూడదనే ప్రభుత్వం సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

భానుపురి (సూర్యాపేట) : పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పీసీసీ, డీసీసీ అనుమతి లేకుండా పాదయాత్రలు నిర్వహిస్తే అది కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదన్నారు. ఏఐసీసీ నిర్ణయించిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర నియోజకవర్గ సీనియర్ నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు నిర్వహించాలని, పార్టీ పేరు చెప్పుకుంటూ పార్టీని అస్థిరపరిచే విధంగా, బలహీన పరచాలని చూసే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు.

సభను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : హైదరాబాద్‌లో ఈనెల 14న తాండ్రకుమార్ ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఎంసీపీఐ (యూ) పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి వరికుప్పల వెంకన్న కోరారు. శనివారం మండల కేంద్రంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య, పత్తేపురం యాదగిరి, నలుగూరి రమేష్, రాజు, సుధీర్, సత్తయ్య పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్స్ నియోజకవర్గ జాయింట్ సెక్రటరీగా సంతోష్



నియామకపత్రం అందజేస్తున్న హుస్సేన్

తుంగతుర్తి : హ్యూమన్ రైట్స్ నియోజకవర్గ జాయింట్ సెక్రటరీగా మండల కేంద్రానికి చెందిన గునిగంటి సంతోష్ నియమితులయ్యారు. శనివారం మండల కేంద్రంలో జాతీయ మానవ హక్కుల న్యాయ సేవ సంఘం అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్ సంతోష్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో విద్య, వైద్య, ఆరోగ్య, న్యాయ, రెవెన్యూ సమస్యలపై స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. సమాజంలో స్త్రీలపై జరుగుతున్న దాడులు, వివక్షత, బాలకార్మికులపై జరుగుతున్న అన్యాయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తేవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాం నవీన్, వీరస్వామి, నగేష్, రాజు పాల్గొన్నారు.

నిలిచిన 'మిషన్ భగీరథ' నీళ్లు

- పైపులైన్ల మరమ్మతులతో నీటి సరఫరాకు అంతరాయం
- రెండు మండలాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అర్వపల్లిలో నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు



కాసర్లపహాడ్‌లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

అర్వపల్లి : వేసవి రాక ముందే పల్లెల్లో నీటి సమస్య తీవ్రమైంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం నిర్వహణ లోపంతో తరచూ సమస్యలు వస్తున్నాయి. దీంతో ఆయా పల్లెల్లో తాగునీటికి సమస్యలు ఏర్పడుతున్నాయి. నూతన్‌కల్ మండలం చిల్పకుంట్లలో నిర్మించిన మిషన్ భగీరథ ప్లాంట్ నుంచి జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాలకు తాగునీటిని సరఫరా జరుగుతుంది. ఈ ప్లాంట్ నుంచి రెండు మండలాల పరిధిలోని సుమారు 50గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుంది. అయితే తరచూ మిషన్ భగీరథ పంపులు, పైపులైన్ల మరమ్మతులు ఏర్పడడం, మరమ్మతులు ఏర్పడిన వెంటనే సమయానికి సిబ్బంది గుర్తించి మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామాలకు రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతుంది.

10రోజులుగా నిలిచిపోయిన నీళ్లు..

మిషన్ భగీరథ పంపుల్లో ఏర్పడిన సమస్యతో జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాలకు 10రోజులుగా భగీరథ నీరు నిలిచిపోయాయి. ఇప్పటికే ఎండలు తీవ్రం కావడంతో నీటి వాడకం పెరిగింది. దీనికి తోడు గ్రామాల్లో శుభకార్యాలు ఎక్కువగా జరుగుతుండటంతో నీరు సరిగా రాక ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడాల్సివస్తుంది. మిషన్ భగీరథ పథకం ప్రారంభమైనప్పటి నుంచి చేతి పంపులు, రక్షిత మంచినీటి పథకాలు మూలనపడ్డాయి. ఇవి మూలన పడటం, మిషన్ భగీరథ నీళ్లు నిలిచి పోతుండటంతో గ్రామాల్లో ప్రజలు నీటి కోసం అల్లాడి పోతున్నారు. దీంతో గ్రామపంచాయతీలు తప్పని పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే సర్పంచ్‌లు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సకాలంలో నిధులు విడుదల కాక ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు మిషన్ భగీరథ నీరు రాక మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని సర్పంచ్‌లు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, పంచాయతీలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం



మిషన్ భగీరథ నీరు నిలిచి పోవడంతో 10రోజుల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. రోజుకు 3ట్యాంకర్ల నీటిని అన్ని వీధుల్లో పోయిస్తున్నాం. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడం ఇబ్బందిగా మారింది.

– దబ్బేటి జ్యోతిరాణి, సర్పంచ్, కాసర్లపహాడ్

నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి



మిషన్ భగీరథ నీటి సరఫరాను అధికారులు సక్రమంగా నిర్వహించాలి. పంపుల మరమ్మతుల పేరుతో తరచూ నీటి సరఫరా నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. మా పంచాయతీ పరిధిలోని 3గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సి వస్తుంది.

– బైరబోయిన సునీత, సర్పంచ్, అర్వపల్లి

యోగా, ధ్యానం అలవాటుగా మార్చుకోవాలి

సూర్యాపేట : మానసిక ఒత్తిడి నివారణకు నిత్యం యోగా, ధ్యానం ఒక అలవాటుగా మార్చుకోవాలని మానసిక ఆరోగ్య నిపుణులు డాక్టర్ స్రవంతి అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ ఆవరణలో జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా 'మానసిక ఒత్తిడిని జయించడం ఎలా'అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మార్కులు ప్రామాణికంగా చదవడం పట్ల తీవ్రమైన ఒత్తిడి ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండడంతో ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చని తెలిపారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. మానసిక సమస్యలు ఉన్నవారిని హేళనగా చూడడం సమంజసం కాదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో లభించే ఉచిత మందులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ.. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మానసిక వైద్య నిపుణుల సేవలు అందుబాటులో ఉన్నాయని, ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవడానికి ఆరోగ్య కార్యకర్తలను, ఆశకార్యకర్తలను సంప్రదించాలని కోరారు. పరీక్షల సమయంలో విద్యార్థులు తీవ్రఒత్తిడికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యాధికారుల ఆధ్వర్యంలో సంబంధిత మండలాలలో ప్రత్యేక సూచనలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ పెండం వెంకటరమణ, డీపీఓ కిరణ్, కోఆర్డినేటర్ బూతరాజు సైదులు, మేనేజర్ భాస్కర్‌రాజు, శర్మ, నాయుడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పల్లె దవాఖాన వైద్యులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకోని అంబులెన్సులు ఎందుకు ?



గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేస్తున్న వైఎస్ఆర్‌టీపీ అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రమాదం జరిగిన 100కు కాల్ చేస్తే అంబులెన్సులు సమయానికి రావడం లేదని వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న అన్నారు. శనివారం తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామ సమీపంలో కారు ఢీకొని మామిడాల గ్రామానికి చెందిన దుప్పల్లి రాజారామ్ తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో కారులో వస్తున్న ఏపూరి సోమన్న దెబ్బ తాకిన వ్యక్తిని చూసి అంబులెన్సుకు కాల్ చేయగా గంట సమయం అయినా రాకపోవడంతో తన స్వంత వాహనంలో చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి పేద ప్రజల ప్రాణాలు కాపాడటానికి 108 వాహనాన్ని ప్రారంభించారని తెలిపారు. గతంలో ప్రమాదం జరిగిన చోటికి నిమిషాల్లో వచ్చే వాహనాలు ఇప్పుడు గంటల తరబడి రావడం లేదని ఆరోపించారు. ఆలస్యంగా వస్తుండటంతో ప్రమాదాల్లో గాయపడిన వారు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంబులెన్సులు త్వరగా వచ్చేలా చూడాలని కోరారు.

చంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి



చంద్రారెడ్డి వర్ధంతి సభలో మాట్లాడుతున్న అవునూరి మధు

నాగారం : పీడిత ప్రజల నాయకుడు యానాల చంద్రారెడ్డి ఆశయసాధనకు కృషిచేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అవునూరి మధు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వక్కవంతుల కోటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామ స్టేజీ వద్ద యానాల చంద్రారెడ్డి 40వ వర్ధంతిని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో వారు పాల్గొని మాట్లాడారు. చంద్రారెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టి తుంగతుర్తి ప్రాంతంలో విప్లవ ఉద్యమాలు చేశారని అన్నారు. భూమికోసం, భుక్తికోసం, పేద ప్రజల విముక్తి కోసం, అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం, దున్నేవాడికే భూమి కావాలని భూపోరాటాలను నిర్వహించిన గొప్ప మహనీయుడని కొనియాడారు. నేటి విప్లవ కారులకు, యువతరానికి చంద్రారెడ్డి స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సభలో కె.అనంతరెడ్డి రచించిన ఉమ్మడి నల్గొండ జిల్లా అమరవీరుల 'అగ్నికణాలు'అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, రాష్ట్ర నాయకులు అచ్యుత రామారావు, కె.అనంతరెడ్డి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, కొమరయ్య, భద్రయ్య, ఉపేంద్ర, గంట నాగయ్య, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, కిరణ్, మధు, సైదులు, సుధాకర్‌రెడ్డి, బడేమియా, కృష్ణమూర్తి, లింగయ్య, హేమలత పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- టీపీసీసీ కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి



పాదయాత్ర చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, నాయకులు

సూర్యాపేట రూరల్ : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు లక్షల ఇళ్లను పేద ప్రజలకు మంజూరు చేసినట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా పటేల్ రమేష్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర శనివారం మండలంలోని కేటీ అన్నారం నుంచి కుప్పిరెడ్డిగూడెం మీదుగా పిల్లలమర్రి గ్రామానికి చేరింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలోఎంతమంది పేదవారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇచ్చారో చెప్పాలన్నారు. ఎక్కడో కొన్ని ఇళ్లు నామమాత్రంగా కట్టిస్తే నాణ్యత లోపంతో అప్పుడే శిథిలావస్థకు చేరుకున్నాయని విమర్శించారు. స్వంత స్థలం ఉన్న వారికి రూ.3లక్షల మంజూరు చేసిన దాఖలాలు ఎక్కడా లేవని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నేటి వరకు ఇవ్వకపోవడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూడా పూర్తిగా విఫలమయ్యారన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలో విలీనం చేసిన కుప్పిరెడ్డిగూడెం, రాయినిగూడెం, పిల్లలమర్రి గ్రామాల్లో ఉపాధి పనులు లేక ఎంతో మంది కూలీలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ గట్టు శ్రీనివాస్, నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, ఎడ్ల గంగాభవాని, గోదల రంగారెడ్డి, ధరావత్ వెంకన్ననాయక్, ఎడ్ల వీరమల్లుయాదవ్, నామ ప్రవీణ్, వేణు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాదిక్, నాగరాజు, ఆనంద్, సత్తయ్య, బుచ్చమ్మ, సంజీవస్వామి, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ల ఆత్మీయ సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట) : రెడ్ల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో రెడ్ల ఆత్మీయ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రెడ్డి కార్పొరేషన్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 12సభలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా నెమ్మికల్‌లో ఈనెల 26న రెడ్ల ఆత్మీయ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నిరుపేద రెడ్డి విద్యార్థులకు విదేశీ విద్యానిధి తోడ్పాటు అందించి రెడ్డి గురుకులాలు ఏర్పాటు చేయాలని కోరారు. 60సంవత్సరాలు నిండిన ప్రతి రెడ్డి రైతుకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడు సురకంటి నర్సిరెడ్డి, గోదాల రంగారెడ్డి, పగిళ్ల గన్నారెడ్డి, యానాల రామ్‌రెడ్డి, సెదిరెడ్డి, ముకుందరెడ్డి, వెన్న వెంకటరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సైదిరెడ్డి, కృష్ణారెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అదానీ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాపంథా నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అదానీ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అతడిపై చర్యలు తీసుకోవాలని ప్రజాపంథా జిల్లా కన్వీనర్ కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. అదానీకి కేంద్ర ప్రభుత్వం అండగా ఉందని ఆరోపిస్తూ శనివారం జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదానీ దేశ సంపదను కొల్లగొట్టి ప్రజల ఆస్తులను సొంతం చేసుకుంటున్నారని అన్నారు. లక్షల కోట్లు స్టాక్ మార్కెట్లో నష్టపోయి ఎల్ఐసీలో పాలసీదారుడిగా ఉన్న సుమారు రూ.65కోట్ల మంది పెట్టుబడిదారుల జీవితాలతో ఆడుకున్నాడని, అతడిపై చర్యలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం మీనావేషాలు వేస్తూ కాపాడాలని చూస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపెల్లి రేణుక, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎర్ర అఖిల్, సింహాద్రి, పద్మ, బుజ్జి, జీవన్, గోగుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించకపోవడంతో ఫంక్షన్‌హాల్ సీజ్

సూర్యాపేట : పట్టణంలోని సైనిక్‌పురి కాలనీ సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం సీజ్ చేసినట్లు మున్సిపల్ మేనేజర్ మున్వర్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫంక్షన్ హాల్ యాజమాన్యం రూ.3,97,504ల ఇంటిపన్ను బకాయి చెల్లించకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సభ్యులు ఆర్ఐ శివరామ్‌రెడ్డి, మాధవి, మనోజ్, బిల్ కలెక్టర్ ఉషా తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుపతమ్మగోపయ్య స్వామి కల్యాణం



అమ్మవారి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో గల శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్య స్వాముల కల్యాణ మహోత్సవాన్ని శనివారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు భాస్కరశర్మ అమ్మవార్ల విగ్రహాలను అందంగా అలంకరించి మంత్రోత్సవాల నడుమ కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా గోళ్ల శంకర్‌రావు-మల్లిక, దేశగాని రాజీవ్‌గాంధీ-సరస్వతి, వెన్న గోపిరెడ్డి-లిఖిత దంపతులు పాల్గొని కల్యాణం జరిపించారు. అనంతరం దేవతామూర్తులను దేవాలయం చుట్టూ డప్పుచప్పుళ్లతో ఊరేగింపు చేసి అమ్మవారిని దేవాలయంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, ఎంపీటీసీ జులకంటి వెంకట్‌రెడ్డి, గుర్రం అమృతారెడ్డి, బిజిగ గోపి, వెంకట్రావుగౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అరికట్టాలి

నాగారం : మండల పరిధిలోని బిక్కేరువాగు నుంచి అనుమతులు లేకుండా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.వలీ అన్నారు. శనివారం మండల పరిధిలోని శాంతినగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను అక్రమంగా రవాణాకు పాల్పడమే కాకుండా, ఇసుక ట్రాక్టర్లను నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించిన ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు ఫరీద్, బుడెన్, హుస్సేన్, సయ్యద్, జానీ, అక్బర్‌పాష, బాజీ, సురేష్ ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

సూర్యాపేటటౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఈనెల 24న ఎస్‌టీఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలన్నారు. అలాగే నూతన విద్యా విధానాన్ని (ఎన్‌ఈపీ) రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, పి.శ్రీనివాస్‌రెడ్డి, కె.అరుణభారతి, వెంకటయ్య, సయ్యద్, వీరారెడ్డి, పాపిరెడ్డి, రమేష్, అనిల్‌కుమార్, జనార్దనరావు, రమేష్, క్రాంతిప్రభ పాల్గొన్నారు.

ఉండ్రుగొండలో వైభవంగా పవిత్రోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామశివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారతోరణం, చతుస్థానార్చన, శిఖర కలశము, ధాన్యాదివాసం, లక్ష్మీనారసింహ హోమం, నిత్య పూర్ణహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో జరిగే పూజల్లో దోశాలు జరిగితే పోవడానికి నిర్వహించే కార్యక్రమానే పవిత్రోత్సవాలు అంటారని అర్చకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరుట్ల రవికుమారచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ చకిలం కృష్ణకుమార్, కృష్ణమాచార్యులు, సభ్యులు ఆదుర్తి రామయ్య, బంధకవి కృష్ణమోహన్, మిట్టకోల మధుసూదన్‌రావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాయానికి సహకరించాలని కోరారు.

'గౌడ జనహక్కుల' కార్యదర్శిగా బత్తిని లింగయ్యగౌడ్

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన బత్తిని లింగయ్య గౌడ జనహక్కుల పోరాట సమితి మండల కార్యదర్శిగా నియమితులయ్యారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయనకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి నారాయణగౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కి బుచ్చయ్యగౌడ్, మండల అధ్యక్షుడు పులుసు లింగ మల్లయ్య, వెంకన్న, సాయిలు, ప్రవీణ్ ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి హనుమంతసేవ



హనుమంత వాహనంపై స్వామివారిని ఊరేగింపు చేస్తున్న అర్చకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి హనుమంత సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంత వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇంటింటికి హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, ఉపసర్పంచ్ ప్రభాకర్, కడారి నరేష్, ఈఓ వై.శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు విఖనసాచార్యులు, రాంబాబుఅయ్యంగార్, ఆనంద్‌దీక్షితులు, పవన్, సాయిరాం, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సూర్యాపేట : పట్టణంలోని బేబీమూన్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ఉన్నత అధికారులుగా, రాజకీయ నాయకుల వేషధారణతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చిలుముల విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురువయ్య సేవలు మరువలేనివి

పెన్‌పహాడ్ : ప్రజల మనిషి ధనియాకుల గురువయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగులపాటి అన్నారంలో గురువయ్య 24వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా నాయకుడు గురువయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, వెంకటేశ్వర్లు, సత్యం, వెంకన్న, ధనియాకుల శ్రీనివాస్, సైదులు, వెంకన్న, సతీష్, భిక్షం, రాఘవరెడ్డి పాల్గొన్నారు.